# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 31 జులై, 2025 | పేజీలు :08


## చెత్త సేకరణ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి




వివరాలు మొయిన్‌లో

# విద్యార్థుల వినతిపై తక్షణమే స్పందించిన కలెక్టర్



### కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్‌లో చేరిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రైవేట్ కళాశాల నిరాకరిస్తోందని బాధిత విద్యార్థులు చేసిన ఫిర్యాదుపై కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తక్షణమే స్పందించారు. అప్పటికప్పుడు కలెక్టర్ తానే స్వయంగా ప్రైవేట్ కాలేజీకి వెళ్లి విద్యార్థులకు టీసీలు ఇప్పించారు. వివరాలిలా ఉన్నాయి. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించిన సమయంలో కలెక్టర్ వాహనాన్ని గమనించి బాధిత విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి తమ ఆవేదనను తెలిపారు. కమ్మర్‌పల్లిలో శ్రీభాషిత ప్రైవేట్ జూనియర్ కలాశాలలో గత యేడాది ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన తాము ఫీజు భారం భరించే స్థోమత లేక ఈ యేడాది స్థానికంగా గల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సెకండియర్‌లో చేరటం జరిగిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. టీసీ గోసం గడిచిన పక్షం రోజుల నుండి ప్రైవేట్ కాలేజీ చుట్టూ తిరుగుతున్న తమకు టీసీ ఇవ్వటం లేదని ఆవేదన వెలిబుచ్చారు. విద్యార్థులకు వారికి నచ్చిన కాలేజీలో చదివే స్వేచ్ఛ ఉందని, సెకండియర్ కూడా ఇక్కడే చదవాలని బలవంతం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు ఇప్పటికిప్పుడు టీసీలు ఇవ్వాలని, లేని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ ప్రసాద్‌ను, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను అక్కడికి పిలిపించుకుని విద్యార్థులకు వెంటనే టీసీలు ఇప్పించి ప్రభుత్వ కాలేజీలోని ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ చూపిన చొరవతో నిమిషాల వ్యవధిలో తమ సమస్య పిరష్కారమైందని ఫీజుల భారం పడకుండా విద్యా సంవత్సరం నష్టపోకుండా తమను ఆదుకున్నారని హర్షితిరేఖాలు వెలిబుచ్చారు. విద్యార్థుల వినతిపై కలెక్టర్ సత్వరమే స్పందించి సమస్యను స్వయంగా దగ్గరుండి పరిష్కరించడం పట్ల స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేశారు.

### నిబంధనల ప్రకారం

# పశు కళ్యాణ్ సమితి ఏర్పాటు



### కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నిబంధనల ప్రకారం పశు కళ్యాణ్ సమితి ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పశు కళ్యాణ్ సమితి ఏర్పాటు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులలో రోగుల సంక్షేమం కోసం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ మేరకు పశు కళ్యాణ్ సమితి ని వెటర్నరీ ఆసుపత్రుల పర్యవేక్షణ, పశువుల సంక్షేమం నిమిత్తం పశు కళ్యాణ్ సమితి ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. పశు కళ్యాణ్ సమితి ను జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కన్వీనర్ గా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కమిటీలో ప్రతి పంచాయతీ నుంచి డి.పి.ఓ. ను, అదే విధంగా జిల్లా పరిధిలో ఉన్న 4 ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన 13 మండలాలకు 13 మంది సభ్యులను నియమించాలని, పశుసంవర్ధక శాఖ తరపున అధికారులను కమిటీలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. జిల్లాలోని పశువుల ఆరోగ్య స్థితిగతులను మెరుగు పర్చడం, వెటర్నరీ ఆసుపత్రుల అభివృద్ధి, ఆధునీకరణకు కృషి, పశు వైద్య కార్యక్రమాల నిర్వహణలో సహకారం, పశు వైద్యం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజలను విస్తృతంగా పాలనలో భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా పశు కళ్యాణ్ సమితి పని చేస్తుందని అన్నారు.జిల్లా స్థాయిలో పశు కళ్యాణ్ సమితి లను సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేయాలని, ఎగ్జిక్యూటివ్ కమిటీ నియమించాలని, మార్గదర్శకాలను, టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ నోటిఫై చేయాలని అన్నారు. పశు కళ్యాణ్ సమితి ఏర్పాటు సంబంధించి చేపట్టిన చర్యల రిపోర్ట్ ను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి 15 రోజులలో హెడ్ ఆఫీస్ కు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.వెటర్నరీ హాస్పిటల్స్ నిర్మాణానికి అనువైన స్థలాలను, ఇతర వసతులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి డిపిఓ షరీఫుద్దీన్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### యువతకు శిక్షణ ఉపాధి కల్పించడమే

# ఎటిసి ముఖ్య ఉద్దేశం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** స్థానిక జగిత్యాల జిల్లాలో గల ప్రభుత్వ పారిశ్రామిక నైపుణ్యత శిక్షణ కేంద్రం అడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్ గా పరిణితి చెంది పరిశ్రమ 4.0 వంటి అత్యాధునిక సాంకేతికతలపై యువతకు శిక్షణ ఇవ్వడం దీని ప్రత్యేకత కాగా జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఏటిసి పోస్టర్ ను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆవిష్కరించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏటిసి అడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్ కళాశాల ద్వారా టిగేట్ ఆధ్వర్యంలో నైపుణ్యత శిక్షణ ఉపాధి కల్పించడం కోసమే ప్రభుత్వ పారిశ్రామిక నైపుణ్యత శిక్షణ కేంద్రం అడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్ లో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ ఎఫ్ఈఎం, సిఎంసి మిషినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ లాంటి ఆరు కోర్సులు ఉంటాయని ఆ కోర్సులను నిష్ణాతులైన అత్యాధునిక నైపుణ్యం కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందని శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ప్రాచుర్యం పొందిన టాటా టెక్నాలజీస్ వంటి కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించడం టిగేట్ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశం అని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ పారిశ్రామిక నైపుణ్యత శిక్షణ కేంద్రంలో పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు పై కోర్సులకు అర్హులుగా ఎంపిక కావాడతారు. కాబట్టి ఈ అవకాశాన్ని అర్హత కలిగి ప్రతి ఒక్కరు జూలై 31 కి ముగియనున్న సెకండ్ ఫేస్ అడ్మిషన్ ను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. ఈ టీగేట్ కమిటీలో లేబర్ సహాయక కమిషనర్ సురేందర్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి సత్యమ్మ మరియు కన్వీనర్‌గా రవీందర్ బాధ్యతలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



# మానేరులో స్టూడెంట్ కౌన్సిల్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** విధ్యార్థులు లక్ష్య సిద్ధితో సాధన చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సిబిఎస్ఇ పాఠశాల ఆవరణలో మానేరు సిబిఎస్ఇ పాఠశాల ఆవరణలో మానేరు స్టూడెంట్ కౌన్సిల్ 2025 కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ముందుగా మానేరు విద్యాసంస్థల చైర్మన్ స్కూల్ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలకు చెందిన విధ్యార్థులు గ్రూప్‌ల వారీగా డంబుల్స్, లెజియమ్స్, రిబ్బన్స్, ఫ్లాగ్స్ తదితర వాటితో మార్చ్ ఫాస్ట్ చేయగా అనంతరెడ్డి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ విధ్యార్థులకు విధ్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించడడానికి స్టూడెంట్ ఎన్నికలను పాఠశాలలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కష్టపడి చదువుకుని నవ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.



## "హలో బిసి – చలో గోవా" పోస్టర్ ఆవిష్కరించిన బిసి సంఘం



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** కరీంనగర్‌లో బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆద్వర్యంలో స్థానిక ముకరంపురలోని మహాత్మజ్యోతిబాపూలే మైదానంలో హలో బిసి చలో గోవా పోస్టర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య గౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. మేమెంతో మాకంత అనే నినాదంతో దేశ వ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని విస్తరించాలని బిసి రిజర్వేషన్ల ఆరాద్యుడు బిపి మండల్ ఆగస్టు 7 జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా అన్ని రాష్ట్రాల్లో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యేడాది శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియం గోవా యూనివర్సిటీ దగ్గర సాంటాక్రోచ్ గోవాలో అఖిలభారత జాతీయ ఓబిసి పదవ మహాసభను బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరుగుతున్నట్లు తెలిపారు. ఓబిసి మహాసభ విజయవంతం చేయాలని, 42 శాతం అసెంబ్లీలో ఆమోదం పొందిన బిసి రిజర్వేషన్ బిల్లును కేంద్రం 9 వ షెడ్యూల్లో చేర్చి తెలంగాణ బిసిలకు న్యాయం చేయాలని ప్రధాన డిమాండ్లతో జాతీయ ఓబిసి మహాసభలో అనేక తీర్మాణాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బిసి విధ్యార్థి సంఘం అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, యువ జన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, బియ్యని తిరుపతి, బోయిని ప్రశాంత్, జ్యోతి, శ్రావణి, అరుణ, తిరుమల, రాజ్ కుమార్, గుమ్మడి శ్రీనివాస్, నాయకులున్నారు.

## పాఠశాలను సందర్శించిన డిఆర్పి బృందం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం లోని ముత్తారం, పారుపల్లి,శాలగుండ్లపల్లి, అడవి శ్రీరాంపూర్, ఓడేడు,ఖమ్మంపల్లి, సీతంపల్లి,ఇప్పలపల్లి, సందరెల్లి,జిల్లెల్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం డిఆర్పి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ప్లాన్ అమలు, విద్యార్థిల ప్రగతిని పరిశీలించారు. అలాగే పాఠశాల లోని తరగతి గదులను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకోవడానికి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుహాసిని, పద్మాదేవి, జిల్లా రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ్, దేవేందర్ రెడ్డి, సంపతా రెడ్డి, కిరణ్, ప్రభాకర్ రెడ్డి, రవి తోపాటు తదితరులు ఉన్నారు.

## నజీముల్లాఖాన్‌కు సన్మానం



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** ఇటీవల టివిపి అస్టిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నజీముల్లాఖాన్‌ను తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ సెక్రటరీ టి.రామారావు ఆద్వర్యంలో కరీంనగర్ జిల్లా ప్రధాన వైద్యశాలలోని డిసిహెచ్ఎస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ తాజుద్దీన్ ఖాన్‌ను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పుష్పగుచ్ఛంతో సన్మానించారు. మెడికల్ కళాశాలలో కొత్త శానిటేషన్ కాంట్రాక్టర్ బాద్యతలు స్వీకరించినందున ఇదివరకే కాలేజీలో పనిచ్తేన్నందున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని అలాగే కొనసాగించాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈ కార్యక్రమాల్లో డిసిహెచ్ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అగస్టిన్, ఆకుల సురేష్ కుమార్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సన్నీ ఎడ్వర్డ్, జిల్లా అధ్యక్షుడు అతిక్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.దేవరాజ్, జిల్లా ట్రెజరర్ కంది రవి, నర్సింగ్, సూపరిండెంట్, గ్రేడ్ వన్ పిట్టల విజయలక్ష్మి తదితరులున్నారు.

## కార్పోరేట్, రైతాంగ వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పోరేట్, రైతాంగ వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం మండల మహాసభ తిప్పరబోయిన శ్రీకాంత్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్బంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని, సి2 ప్లస్ 50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, రైతు రుణాలు రద్దు చేయాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, ఇండో అమెరికన్ ఫ్రీటెడ్ అగ్రిమెంట్లు తిరస్కరించాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు, రోజువారీ కూలీ రూ.600 పెంచాలని, విద్యుత్తు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము, జవ్వాజి అనిల్, రవి, రవి, నల్లగొండ రమేష్, కౌశిక్, వెంకటేశ్వర్లు, సురేష్, కుమార్, ప్రశాంత్, ఎల్లయ్య, శ్రీకాంత్, తిరుపతి, మల్లయ్యలున్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో తమతో చిన్నప్పటి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్న స్నేహితుడు కూన సాయిబాబాకు బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయి, గుండె పోటుకు గురై ఇటీవల మృతి చెందడంతో తోటి స్నేహితులంతా కలిసి ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు ఒక్కటయ్యారు. సాయిబాబా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు చికిత్స కోసం అంతా కలిసి 1 లక్ష 8 వేల 5 వందల రూపాయలు అందించారు. దురదృష్టం కొద్ది చికిత్స పొందుతూ మృతి చెందడంతో సాయిబాబా కుటుంబాన్ని ఆదుకోవడం కోసం తమ తోటి స్నేహితుడి కుమార్తె పేరున రూ.26 వేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిడ్ చేయాలని వారి కుటుంబానికి బుధవారం ఆ డబ్బును అందించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లాస్‌మెంట్స్ బూడిద సదాశివ, అందె చిన్నస్వామి, పులి శ్రీనివాస్, అంబటి మోహన్, గట్టు జనార్ధన్, డి.బాబు, సుతారి శ్రీనివాస్, తోట హనుమాండ్లు, తాటిపెల్లి శ్రీనివాస్, పోలోజు రాజు, బొంగోని శ్రీనివాస్, శ్రీరాముల ఉత్తమా చారి, ముత్తన్న గారి రాజిరెడ్డి, జెల్ల రాజు, అనగోని శ్రీనివాస్, ఎండి నసీరుద్దీన్, చింతపూల రమేష్, చింతం మహేందర్, బుర్కి పర్శరాములు, అందె తిరుపతిలున్నారు.

## సొంత నిధులతో రోడ్డు మరమ్మతు చేసిన మాజీ సర్పంచ్



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కాచాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్ తన సొంత నిధులతో కన్నాపూర్ రాజాపూర్ , కాచాపూర్ గ్రామాల మద్య గుంతలమయమైన రోడ్డును మరమ్మత్తు చేశారు. ఈ సంధర్బంగా గత పది రోజుల నుంచి రాజాపూర్, కాచాపూర్ గ్రామాలకు ఆర్టీసి బస్సు రాకపోవడంతో ప్రయాణికులు, విధ్యార్థులు ఇబ్బందికి గురయినట్లు తెలిపారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు పూడిస్తేనే ఆర్టీసీ బస్సు వస్తుందని వారు తెలపడంతో బుధవారం తన సొంత డబ్బులతో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేసి బస్సు రాకపోకలను పునరుద్దరించారు. ఈ సంధర్బంగా రెండు గ్రామాల ప్రజలు, విధ్యార్థులు గట్టు తిరుపతి గౌడ్ సేవలను కొనియాడి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తప్పడు పోస్టులు పెట్టిన పుల్లూరి సంపత్‌పై ఫిర్యాదు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** తనపై, తన తల్లిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేసినట్లు కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య తెలిపారు. తల్లి బోయిని ఐలమ్మపై సంపత్ కుమార్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. సంపత్ జిఎన్‌పిడిఎసిఎల్‌లో ఎల్‌ఎంవోగా విధులు నిర్వహిస్తూ కోరపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌లో 973లోని 3.10 గుంటల భూమిని తాము కొనుగోలు చేసిన భూమిపై గత కొన్నేళ్లుగా కొంత మంది వ్యక్తులను పెట్టుకుని ఒక ముఠాగా ఏర్పడి తాను, తన తల్లిపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడంటూ దుయ్యబట్టారు. అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ రోడ్లపై ధర్నాలు, నిరసనలు , ఫ్లెక్సీలు ప్రదర్శనలు చేస్తూ అభ్యంతరకమైన పోస్టులు పెడుతూ సమాజంలో తనను చెడు వ్యక్తిగా చిత్రీకరిస్తున్నాడన్నారు. పౌర హక్కులను, ప్రాథమిక హక్కులను భంగం కలిగిస్తూ వ్యక్తిగతమైన ఆరోపణలు చేస్తున్నాడని వాపోయారు. పుల్లూరి సంపత్ వల్ల తనకు పరువు నష్టం జరిగిందని, నోటీసులు సైతం పంపాన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి సివిల్ వివాదాల్లో తలదూర్చి చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిపి, ఆర్డీవో, జమ్మికుంట తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

## తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

**ప్రజాపక్షం/రామడుగు:** మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన పొన్నం తిరుపతి గౌడ్ (48) తన వృత్తిలో భాగంగా బుధవారం తాటి చెట్టు ఎక్కే క్రమంలో మోకుజారి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్ర గాయాలయ్యారు. చుట్టుపక్కల తాళ్లు ఎక్కే గీత కార్మికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పొన్నం తిరుపతి గౌడ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని గీత కార్మికులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎఒ

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** జిల్లాలోని ఇల్లందకుంట మండలంలో గల పలు ఫర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. యూరియా నిల్వలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా సిరిసేడు, బుజునూరు రైతు వేదికల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, మమత, సంపత్, ఫర్టిలైజర్ షాప్ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

# రోడ్లపై ఉన్న ఆవుల పట్ల యజమానులు బాధ్యత వహించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు మంగళవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో రాత్రి పగలు అని తేడా లేకుండా ఆవులు రోడ్లపై సంచరిస్తూ వాహనల రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తు వాహనదారులు ప్రమాదలకు గురువుతున్నారని అలాగే ఆవులు కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జరుగుతుందని ఆవుల యజమానులు దయచేసి వాటిని ఇండ్లలోకి తీసుకవేళ్ళాలని లేని యెడల రెండు రోజుల్లో పశువైద్య అధికారులు మరియు పోలీస్ అధికారుల సమన్వయంతో మున్సిపల్ సిబ్బంది చేత గోశాలలకు తరలించడం జరుగుతుంది అని అలాగే గోవుల కోసం వచ్చిన వారికి భారీ జరిమానాలు విధిస్తామని అన్నారు.



## మహిళ అదృశ్యంపై కేసు నమోదు



**ప్రజాపక్షం/ముత్తారం :** మహిళ అదృశ్యంపై బుధవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం పోలీస్ ఠాణాలో కేసు నమోదైనట్లుగా ఎస్ఐ నరేష్ తెలిపారు.ముత్తారం మండల కేంద్రానికి చెందిన కొమిరే రేణుక (30) సంవత్సరాలు గల తన భార్య తోపాటు కుమారుడు ఈనెల 16 నుండి కనబడుటలేదని ముత్తారం పోలీస్ స్టేషన్ లో రేణుక భర్త భీమయ్య ఫిర్యాదు చేశారు.బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలగూడెం గ్రామం జన్నారం మండలంకు చెందిన భీమయ్య కి 10 సంవత్సరాల క్రితం రేణుకతో వివాహం కాగా కూలి పని నిమిత్తంపెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన తిరునారి సత్యనారాయణ కి చెందిన స్క్రాప్ షాపులో కొమిరే భీమయ్య సతీమణి రేణుక ఇద్దరు కలిసి పనిచేస్తున్నారు. అయితే ఈ నెల 15వ తేదీ రోజు నుండి తన భీమయ్య భార్య రేణుక, తన కుమారుడు ఇద్దరు 16వ తేదీ నుండి షాపులో కూడా కనబడుటలేదని అయితే ఇదే షాపులో పనిచేస్తున్న కేషనపల్లి గ్రామానికి చెందిన కల్వచర్ల సత్యనారాయణ నే తన భార్యను కుమారుడిని తీసుకువెళ్లారని అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా భీమయ్య ఫిర్యాదు వేరకు కేసు నమోదు చేసి, దర్యాప్త చేస్తున్నట్లుగా ఎస్ఐ నరేష్ తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/వీర్నపల్లి :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వీర్నపల్లి మండల వైద్యాధికారులు అన్నారు.బుధవారం గర్జనపల్లి గ్రామం జవహర్‌లాల్ తండా,భంగిరెడ్డి తండాలో డ్రై డే, ఫీవర్ సర్వే నిర్వహించారు. తండా వాసులకు ఎలాంటి వ్యాధులు ప్రభలకుండా చేయాలనే ఉద్దేశంతో 60 మందికి ఫీవర్ సర్వే చేయగా అందులో ఎవరికి ఎలాంటి జ్వరాలు లేవని నిర్ధారించారు. అలాగే భూక్యా తండా, రాశిగుట్ట తండాలో 67 ఇండ్లలలో సర్వే చేయగా, ఇద్దరికి నార్మల్ జ్వరాలు, ఒకరికి జ్వరం తీవ్రత ఎక్కువ ఉండటంతో పిహెచ్‌సి పంపామని డాక్టర్ స్నేహ తెలిపారు. అందుకే వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశామని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవీన్,ఎంఎల్‌ఎచ్‌పి బాలక్రిష్ణ, ఆకాష్, ఏఎన్ఎంలు సుజాత, మంజుల,ఇందిర,ఆశాలు పాల్గొన్నారు.

## పెద్దపల్లి లేబర్ అధికారిని బదిలీ చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి అసిస్టెంట్ లేబర్ అధికారి హేమలతను తక్షణమే బదిలీ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కార్మిక శాఖ ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినట్లు బొంకూరి కైలాసం తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వారికి లేబర్ కార్డులు ఇవ్వడంలో ఇక్కడి అసిస్టెంట్ లేబర్ అధికారి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. లేబర్ కార్డులు ఇవ్వకపోవడంతో ఎందరో అసంఘటిత రంగ కార్మికులకు అన్యాయం జరుగుతోందని, లేబర్ కార్డుల ద్వారా రావాల్సిన బెనిఫిట్స్ అందడం లేదన్నారు. హేమలత బదిలీ చేసేవరకు పోరాడుతామని అందుకు గాను కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీ మెంబర్లుగా బొంకూరి కైలాసం, కన్నం లక్ష్మ ణ్, శంకనపల్లి లక్ష్మ ణ్,కోటగిరి పాపయ్య, బొంకూరి రాములు, అడ్లూరి ఈశ్వర్, పెర్క రాజేందర్, కత్తెరపాక ఎల్లయ్య, ఉప్పులేటి మొండయ్య, ఆరేపల్లి క్రాంతి కుమార్ లను ఎన్నుకున్నారు.



## రేకుర్తి కంటి వైద్యుల సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రేకుర్తి కంటి వైద్యుల సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ అధ్యక్షులు డాక్టర్ జూపల్లి తిరుమల్ రావు అన్నారు.లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గర్రెపల్లి గ్రామంలో దాదాపు 230 పైచీలకు మందికి ఉచితంగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించిన విషయం విధితమే. శిబిరంలో భాగంగా 39 మందికి శాస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో క్లబ్ అధ్యక్షుడు తిరుమలరావు కరీంనగర్ లో గల రేకుర్తి ఆసుపత్రికి వారిని ఉచితంగా తరలించి చైర్మన్ కొండ వేమ్మూర్తి, వైస్ చైర్మన్ చిదర సురేష్ సహకారంతో పూర్తి ఉచితంగా లయన్స్ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో వైద్యులు నేత్ర శాస్త్ర చికిత్సలను నిర్వహించారు. శాస్త్ర చికిత్సలు చేయించుకున్న ప్రతి ఒక్కరికి ఉచిత భోజన సదుపాయాన్ని సైతం ఏర్పాటు చేశారు. అనంతరం అధ్యక్షుడు తిరుమల్ రావు మాట్లాడుతూ ఐ హాస్పిటల్ చైర్మన్ కొండ వేమూర్తి, వైస్ చైర్మన్ చిదర సురేష్ ల సేవలను కొనియాడుతూ వారిని సత్కరించారు.ఆస్పత్రి వైద్యుల సేవలు ఎంతో అభినందనీయమని అన్నారు. వైద్యులు హారిక, మై మూన్, టెక్నీషియన్ చింతల ప్రభాకర్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు 320 జి.జిఈటి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, పూర్వపు అధ్యక్షులు దీకొండ భూమేష్,ఉపాధ్యక్షులు పూసాల సాంబమూర్తి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.





## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/వేములవాడటౌన్:** సైబర్ సెల్ ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ మండలం లోని హన్మాజిపేట ప్రభుత్వ పాఠశాల లో సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులకు పలు సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ముఖ్యం గా ఓ టీ పి ఫ్రాడ్, ఏ పి కే ఫైల్ ఫ్రాడ్ అదేవిదంగా సైబర్ దాడుల నుండి తల్లిదండ్రులు తమను తాము ఎలా రక్షించుకోవాలి, సైబర్ మోసగాళ్ల నుండి విద్యార్థులు ఎలా సురక్షితంగా ఉండగలరు,సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను సరిగ్గా నిర్వహించడం, సురక్షితంగా ఉపయోగించడం, విద్యార్థులు మరియు సాధారణ ప్రజలపై సైబర్ నేరాల ప్రభావం,షాపింగ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నప్పుడు ప్రమాదాలు, జాగ్రత్తలు, ఏపికె ఫైల్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఇన్‌స్టాల్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలు,సైబర్ మోసానికి గురి అయితె డయల్ 1930 కి వెంటనే నేరం గురించి తెలియజేసి ఫిర్యాదు నమోదు చేయటం వంటి విషయాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా సైబర్ సెల్ నుండి రాజు, శ్రీకాంత్, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ సైబర్ వారియర్ రాజశేఖర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన మండల అధ్యక్షుడు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ గా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన కుడుదుల వెంకన్న,వైస్ చైర్మన్ గా ప్రశాంత్ రెడ్డి, పాలకవర్గ సభ్యులను ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,ఓడేడు గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్, లక్క ప్రభాకర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ వెంట సంపత్ రావు తోపాటు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు గౌరవం దక్కుతుంది

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో గౌరవం దక్కుతుందని అందుకు మంథని, కమాన్ పూర్ నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ లను, డైరెక్టర్లు నిదర్శనమే అని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి అన్నారు.బుధవారం ఆయన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనగామ నరసింహారావుతో కలిసి చైర్మన్ లను డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడిన కార్యకర్తలను గుర్తించి మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబులు పదవులు అప్పగించడం శుభసూచకం అన్నారు. పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## మిర్యాలకు అధికారిగా పదోన్నతి

**ప్రజాపక్షం/ముత్తారం :** టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాలరాజిరెడ్డికి అధికారిగా పదోన్నతి లభించింది. ఆఫీస్ సూపరింటెండెంట్ గా ఓసీపీ1 లో పనిచేసే మిర్యాల రాజిరెడ్డి మార్చి 9న జరిగిన రాత పరీక్షలో ఉత్తీర్ణులైన జూనియర్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్ అధికారిగా పదోన్నతి పొందాడు. ఈరోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి కాగా ఎన్సీడబ్ల్యూ కార్మికుని నుండి అధికారిగా పదోన్నతి పొందడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు సన్మానం

**ప్రజాపక్షం/ముత్తారం :** కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమీటి చైర్మన్ వైనాల రాజు, వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, పాలకవర్గ సభ్యులు భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ జెడ్పిటిసి చోప్పరి సదానందం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పథకాలను రైతులకు సత్వర అందిచే విధంగా, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆలోచనలు,యువ నాయకులు దుద్దిళ్ళ శ్రీను బాబు సూచనలతో రైతులకు నిరంతర సేవచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందుల పద్మ ఆనంద్, తాటిపాముల వాక్కుల రాణి శంకర్, గాదం శ్రీనివాస్, లక్కం ప్రభాకర్, తోపాటుకాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న గర్జనపల్లి యువత..

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన జోగుల మనోహర్ అనే యువకుడు మతిస్థిమితం కోల్పోయి ప్రమాదవశాత్తు ఇటీవల మరణించగా, గ్రామానికి చెందిన యువకులు ఆ కుటుంబం పరిస్థితిని చూసి 25 కిలోల బియ్యంతో పాటు 36 వేల రూపాయల నగదును అందించి తమ ఉదారత చాటుకున్నారు. గతంలో కూడా అతని తమ్ముడు మతిస్థిమితం బాగా లేక చనిపోగా, తల్లి కూడా మానసిక స్థితి బాగా లేక ఉండటంతో, తండ్రి చంద్రయ్య దిక్కులేని స్థితిలో ఉన్న అతనికి గర్జనపల్లి యువకులు అండగా నిలిచారు. గజ్జెల ప్రశాంత్, అజ్మీరా నవీన్, నగరపు దేవేందర్, చిన్నం దినేష్, ఎలగందుల చిరంజీవి, జోగుల నరేష్, కాంతయ్య, మంజుల, వినయ్, తిరుపతి, అజ్మీరా గణేష్, న్యాత మోహన్, చంద్రయ్య, నవత తదితరులు సహాయం అందించిన వారిలో ఉన్నారు.

# రాజన్నను దర్శించుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామివారిని మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్యా మురళి నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం స్వామి వారికి పవిత్రమైన కోడె మొక్కును చెల్లిచుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు స్వస్తి వచన పూర్వకంగా ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ ఆయనకు శేష వస్త్రం కప్పి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యేని ఆలయ ఈ ఓ రాధా బాయి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ ఇన్స్పెక్టర్ నాగూరి నరేందర్, ప్రోటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ మహేష్, జూనియర్ అసిస్టెంట్ సింహాచారి మరియు ఇతర ఆలయ సిబ్బంది ఉన్నారు.



## పురుగుల మందు తాగి యువకుడు మృతి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** క్రిమిసంహారక మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ఎం కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గోవింద్‌పల్లి గ్రామానికి చెందిన బోనగిరి రాజయ్య చిన్న కొడుకు బోనగిరి సూర్య (17)ను పై చదువుల కొరకు కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ కాలేజీలో చేర్పించగా అతనికి ఆ కాలేజీలో చదువుకోవడం ఇష్టం లేక ఇంటికి తిరిగి రావడంతో అతని తల్లి దండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన సూర్య ఈనెల 25న ఇంటిలో పురుగుల మందు తాగి మహత్యకు పాల్పడినట్లు తెలిపారు .కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ప్రతిమ హాస్పిటల్ లో చేర్పించగా ,చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 6 గంటల సమయంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తండ్రి బోనగిరి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రాయితీపైన వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ యాంత్రికరణ(ఎస్ఎంఏఎం) పథకం కింద రైతులకు రాయితీపైన వ్యవసాయ పనిముట్లను అందజేయనున్నారని మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్ తెలిపారు. ఈ పథకానికి చిన్న సన్నకారు రైతులకు 40శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం సబ్సిడిపై ఈ వ్యవసాయ పనిముట్లను అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గానీ, వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రైతు వేదికల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కావాల్సిన పత్రాలు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, అప్లికేషన్ ఫారం తీసుకురావాలన్నారు. వివరాలకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జిల్లా కో ఆర్టినేటర్‌గా రజనీ

**ప్రజాపక్షం/జగిత్యాల:** తెలుగు బుక్ఆఫ్ రికార్డ్స్ జగిత్యాల చీఫ్ కో ఆర్టినేటర్‌గా జగిత్యాల కు చెందిన దాసరి రజనీ నియామకమ్యారు. ఈ మేరకు సంస్థ ఫౌండర్ అధ్యక్షులు, చైర్మన్ చింత పట్ల వెంకటచారి రజనీని నియమిస్తు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్టినేటర్ రజనీ మాట్లాడుతూ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ అయినటువంటి ఫౌండర్ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి స్థాపించడం జరిగిందని, మారిషస్ ప్రధానమంత్రి చేతుల మీదుగా 2012లో రికార్డ్స్ ఆవిష్కరణ జరిగింది అన్నారు.

## మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండల ఐకెపీ కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాలకు చెందిన అన్నపూర్ణ మరియు అక్షర మండల సమాఖ్యల సమావేశం బుధవారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ మండల అధికారులు మాట్లాడుతూ సెర్ప్ ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు, బ్యాంక్ లింకేజి, స్త్రీనిధి రుణాలు, ఆయా యూనిట్ల ఏర్పాటు, పాడి గేదెలు, కోళ్ళ ఫారల ఏర్పాటు, పెరటి కోళ్ళ, నాటు కోళ్ళ పెంపకం, చేపల పెంపకం అవుట్లేట్ యూనిట్ల ఏర్పాటు, ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు ఆయా కేటగిరి వారీగా మహిళలకు రుణాల రూపంలో ఇవ్వడం మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు రుణాలు కల్పిస్తుంది అన్నారు. ఇట్టి అవకాశాన్ని జగిత్యాల మండల మహిళా సంఘాల వారు వినియోగించుకోవాలని అన్నారు. అలాగే గత 15 రోజుల పాటు గ్రామ, మండల స్థాయి మరియు నియోజకవర్గ స్థాయిలో జరిగిన కార్యక్రమాలను కమ్యూనిటీ కో ఆర్డినేటర్స్, వి.ఓ.ఏలు, మండల, గ్రామ సమాఖ్యలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగిందని వారందరికీ సమాఖ్య తరపున అభినందనలు తెలియజేశారు. ఇట్టి సమావేశంలో మండల ఏపియం వోదెల. గంగాధర్, జిల్లా ఫామ్ ఎపియం యం.డి.హుస్సేన్, సి.సి.లు పి.గంగారాం, పి.విద్యాసాగర్, బి.రవీందర్, బి.మరియా, జీ.శ్రీనివాస్, రూరల్ సమాఖ్య అధ్యక్షురాలు మారు.సమాఖ్య సిబ్బంది, సి.హెచ్.పద్మ, కే.సురేందర్, డి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లించాలి...

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లించాలని ఎల్లారెడ్డిపేట మండల బిజెపి ఆధ్వర్యంలో ధర్నా రాస్తా రోకో నిర్వహించారు. బుధవారం మండల అధ్యక్షులు రేపాక రాంచంద్రారెడ్డి బిజెపి శ్రేణులతో కలిసి రోడ్డుపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అబద్దపు హామిలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఏ ఒక్క హామిని పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల అకౌంట్లలలో డబ్బులు జమ కావడం లేదని స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని అన్నారు. కార్యక్రమంలో పోన్నాల తిరుపతి రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, నంది నరేష్, దాసరి గణేష్ పూర్ణిమ, సాగ లక్ష్మ న్, లహరి, స్రవంతి, తేజస్వీ, కిరణ్‌నాయక్, రవి నాయక్,అంజనేయులు, వంగ బాపు రెడ్డి, పర్శరాములు, రాజిరెడ్డి, బాలయ్య, గడ్డం రవి, సత్యం రెడ్డి, బాలకృష్ణ, తిరుపతి, సాగర్, నవీన్ తదితరులు ఉన్నారు.



## గ్రామాల్లో విడిసిల పెత్తనం

**ప్రజాపక్షం / మల్లాపూర్:** అసాంఘీక కార్యకలాపాలకు గ్రామాలు కేరాఫ్ అడ్రస్‌గా ఉండోద్దని జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ బాస్ లు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న మండలంలో మాత్రం వారి ఆదేశాలు ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదున. అక్రమంగా నడిచే బెల్ట్ షాపులకు ఇసుక అక్రమ రవాణకు విడిసిలు వేలం పాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికి, ఇటీవలే మండలంలోని మూడు గ్రామాల్లో విడిసిల ఆధిపత్య పోరుతో బెల్ట్ షాపులకు వేలం పాటలు నిర్వహించినప్పటికి అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోవడం విశేషం. విడిసిలు చేసింది శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తూ ఉండడంతో గ్రామాల్లో విడిసిల పెత్తనం జోరుగా అందుకుంటుంది. ఇదంతా జరుగుతున్న సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అధికారుల ప్రోత్సాం విడిసిలకు జోరుగానే ఉందని విమర్శలు స్థానికుల్లో తలెత్తుతున్నాయి. గల్లి గల్లికో బెల్ట్ షాపు, గోదావరి వాగులు వంకలలో ఇసుక దందా నడుస్తుండడంతో అక్రమ వ్యాపారాలకు అసాంఘీక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా మల్లాపూర్ మండలం పేరొందుతుంది. ఇలా విడిసిల వేలం పాటల ద్వారా టెండర్లు దక్కించుకున్న వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో మద్యాన్ని అమ్ముతూ ప్రజలకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై స్తై ని చరవాణి ద్వారా వివరణ కోరగా బెల్ట్ షాపుల అక్రమ వేలం పాటలు తమ దృష్టికి రాలేదని తెలిపారు.

## దానాలలో మహా గొప్పదానం రక్తదానం..

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** అన్ని దానాలలో మహా గొప్పదానం రక్తదానమని, రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని సీనియర్ వైద్యులు మోహన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిభిరంలో బుధవారం 30 మంది రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన శారీరకంగా కూడా ఎంతో మంచిదని, అత్యవసర సమయాల్లో రక్తదానం చేయాలని పేర్కొన్నారు. ఈ శిబిరంలో వచ్చిన బ్లడ్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు , కార్యదర్శులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## సమయం దాటినా... ఆగని ఇసుక రవాణా..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలో సమయం దాటినా అక్రమంగా ఇసుక తరలిస్తున్న కొందరు అక్రమార్కులపై రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ శ్రావణ్ కుమార్ కొరడా ఝులిపించారు. ఇసుక రవాణాకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అనుమతి ఉండగా, పదిర చిట్టి వాగు నుంచి కొందరు సమయం దాటినా ఇసుకను తరలించడంతో, గమనించిన కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత ఇసుక రవాణాకు పాల్పడితే ఎవరిని ఉపేక్షి చేది లేదని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

## ఎంపి నిధులతో బోర్ పాయింట్...

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నాలుగవ వార్డు ఇందిరమ్మ కాలని వద్ద ఎంపి నిధులతో బోర్ పాయింట్ మంజూరు కాగా, బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరికాయ కొట్టి బోర్ పాయింట్ ప్రారంభించారు. కాలని వాసులు అడగగానే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ వెంటనే స్పందించి బోర్ పాయింట్ మంజూరు చేయించారని మండల అధ్యక్షులు రేపాక రాంచంద్రారెడ్డి , ఉపాధ్యాక్షులు దాసరి పుర్ణిమ గణేష్ తెలిపారు. కార్యక్రమంలో చందుపట్ల లక్ష్మారెడ్డి, నంది నరేష్, పిట్ల శ్రీశైలం, మాలోత్ కిరణ్‌నాయక్, పోన్నాల వెంకటేష్, మధు గౌడ్, సాగర్ తో పాటు బిజెపి శ్రేణులు పాల్గొన్నారు..

## జనం మెచ్చిన నాయకుడు:మధు

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని 12వ వార్డు మాజి కౌన్సిలర్‌గా ఉన్నటువంటి తుమ్ మధు ప్రజల గుండెల్లో ఆదర అభిమానాలు సంపాదించుకున్న ఒక మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. పదవి ఉన్న లేకున్నా ఎల్లప్పుడూ ప్రజలకు తోడుగా నిలుస్తు, వారి సమస్యలను తన సమస్యగా భావించి ఆది శ్రీనివాస్ అడుగు జడలో నడుస్తున్న నాయకుడు. 12వ వార్డులో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో రూ.13 లక్షలమంజూరు చేయించి సీసీ రోడ్లు వేయించడంతో కాలనీ వాసులు మధుని అభినందనందించారు. స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి 12వ వార్డుకు సంబంధించిన కొన్ని కార్యక్రమాలకు అతి త్వరలోనే నిధులు మంజూరు చేయించి పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ధర్మపురి:** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు అన్నారు. వంద రోజుల ప్రణాళికా చర్యల్లో భాగంగా పురపాలక సంఘం 6వ వార్డులోని శ్రీ లక్ష్మి నృసింహా కాలనీలో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా జబ్బుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు, ప్రభుత్వ వైద్యులు డా. అస్మా తరుణం, డా. మామిడి వినయ్,గంగాధర్, మహేష్, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై బహిరంగ చర్చకు సిద్ధమా..

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా రైతులకు యూరియా ఎరువులు అందిస్తుంటే జీర్ణించుకోలేక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అబద్ధపు ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని టిపిసిసి నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ముత్యంపేట గ్రామంలోని పిఏసిఎస్ గోదామును స్థానిక రైతులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ జింకును అధిక ధరకు కొనుగోలు చేయించి ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తాను ఇస్తున్నారని ఆరోపించడం సరైంది కాదని తీవ్రంగా ఖండించారు. వీరి వెంట సింగిల్ విండో చైర్మన్ తక్కళ్ల నరేష్ రెడ్డి, డైరెక్టర్లు వాకిటి భూమారెడ్డి, వెంకట్ రెడ్డి, మహేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బొల్లం ప్రకాష్, రఘు ఉన్నారు.



## గంపలపల్లిలో సోలార్ స్ట్రీట్ లైట్ ఏర్పాటు

**ప్రజాపక్షం/తాండూర్‌:** తాండూర్ మండలంలోని అచ్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గంపలపల్లి గ్రామంలో సోలార్ స్ట్రీట్ లైట్ వెలుగులు నింపాయి. డిఎంఎఫ్‌టి నిధుల ద్వారా మంజూరైన లైట్‌ను గ్రామంలో ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. స్ట్రీట్ లైట్ మంజూరుకు కృషి చేసిన బెల్లంపల్లి ఎంఎల్‌ఎ గడ్డం వినోద్ వెంకటస్వామి, స్థానిక నాయకుడు గట్టు మురళీధర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్‌:** ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు సమీప అయ్యప్ప ఆలయంలో బుధవారం శ్రావణమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన గోవింద వైరాగడే స్వామికి అభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అంతకు ముందు ఆలయ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, చంద్రమోహన్, సంతోష్, శ్యామ్, వినాయక్, విశాల్, రాము, ఆశిష్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి

**ప్రజాపక్షం/నెన్నెల/బెల్లంపల్లి :** ఇసుక ట్రాక్టర్ ట్రాలీపై ప్రయాణిస్తుండగా అదుపు తప్పి కింద పడిన మహిళపై ట్రాలీ టైరు పోయి మహిళ మృతి చెందింన ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. నెన్నెల ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి నియోజకవర్గం పెద్ద లంబాడితండ మన్నెగూడెం గ్రామానికి చెందిన ధారావత్ తులసి అనే మహిళ నెన్నెలలోని బ్యాంక్‌కి వెళ్లేందుకు ఖర్జీ నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌లో ట్రాలీ, ఇంజన్ మధ్య రాడ్‌పై నిలబడి ప్రయాణిస్తుంది. గ్రామ శివారులో మలుపు వద్ద ట్రాక్టర్ వేగంగా వెళ్తుండగా ఆమె అదుపు తప్పి కిందపడింది. ఈ క్రమంలో ట్రాలీ ఎడమ వైపు టైరు ఆమె తలపై నుంచి వెళ్లడంతో తులసి అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఎంఎల్‌సి దండే వీటల్‌కు విన్నవించిన పాత్రికేయులు



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్‌:** పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే వీటల్‌కు స్థానిక వర్కింగ్ జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎంతోకాలంగా పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా కనీస సౌకర్యాలు లేవు. వృత్తిరీత్యా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్న పాత్రికేయుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇళ్ల స్థలాలు కేటాయించాలి అని అభ్యర్థించారు. జర్నలిస్టుల విన్నవింపుకు ఎంఎల్‌సి దండే వీటల్ సానుకూలంగా స్పందించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, వీలైనంత త్వరగా స్థలాల కేటాయింపుపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ప్రసాద్, చిరంజీవి, రాజా గౌడ్, కమలాకర్, రాజేష్, సందీప్, శ్రీనివాస్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# పులుల సంరక్షణకు విశిష్ట సేవలు

అవార్డుతో సత్కరించిన సిర్పూర్ సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావు



**ప్రజాపక్షం/సిర్పూర్‌టి :** పులుల సంరక్షణకు తీసుకున్న ప్రత్యేక చర్యలకు గుర్తింపుగా సిర్పూర్ (టి) సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావును రాష్ట్ర ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అత్యుత్తమ టైగర్ ట్రాకింగ్ సేవల కోసం ఆయనకు పురస్కారం అందజేశారు. కాగజ్ నగర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలో పులుల సంరక్షణ కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. పిసిసిఎఫ్ సువర్ణ, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఏలూ సింగ్ మేరు చేతుల మీదుగా మోహన్ రావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ పులుల సంరక్షణ అనేది కేవలం నా బాధ్యత మాత్రమే కాదు ఇది గౌరవంగా భావించే బాధ్యత. నా జట్టు సహకారంతోనే ఈ విజయాన్ని సాధించగలిగాను అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో పులుల భాగస్వామ్యం ఎంతో విలువైనదని, ఈ దిశగా ముమ్ముందు మరింత కృషి అవసరమని అధికారులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎంపిడిఒ కోట ప్రసాద్



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** తెలుగు మీడియం నుండి ఇంగ్లీష్ మీడియంలో చేరిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ద చూపాలని కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఈస్గాం ను ఆయన తనిఖీ చేశారు. ఈ సం దర్బంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించి చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మోనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో గణి త ఉపాధ్యాయుడు గత ఎనిమిది నెలల నుంచి సెలవుపై వెళ్లినందున 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు గణిత బో ధన ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయుటకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపిడిఒను ఉపాధ్యాయులు కోరారు. ఎంపిడిఒ వెంట ప్రధానోపాధ్యాయులు గం గారాం, కార్యదర్శి సుమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

# విజయ్ బస్తీలో కార్డెన్ సెర్చ్

27 బైక్‌లకు జరిమానా అప్రమత్తంగా ఉండండి – పోలీసుల సూచన



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్‌:** పట్టణంలోని విజయ్ బస్తీలో బుధవారం జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు డిఎస్‌పి రామానుజం ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. స్థానికుల వాళ్లు, అద్దెకు ఉండేవారి సమాచారం తెలుసుకుని రికార్డు చేశారు. డిఎస్‌పి రామానుజం మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిచయాలు లేని కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. అనుమానాస్పద వ్యక్తుల గురించి ఆలస్యం చేయకుండా పోలీసులకు తెలపాలి. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ప్రతి ఒక్కరూ సామరస్యంగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి అని అన్నారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, రూరల్ సిఐ కుమారస్వామి, టౌన్ ఎస్‌ఐలు సాగర్, సురేష్, రూరల్ ఎస్‌ఐ సందీప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నవేగంలో పాఠశాల, ఇళ్ల పనులపై సమీక్షించిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** విద్యార్థులకు శుభ్రమైన వాతావరణం, లబ్ధిదారులకు శీఘ్రంగా ఇళ్లు అందేలా చూడాలి అని ఎంపిడిఒ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన సిర్పూర్ టౌన్ మండలంలోని నవేగం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనానికి వాడుతున్న ధాన్యాల నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో, అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలకు కేటాయించిన భూమి కబ్జాకు యత్నం

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు సర్వే నంబరు 112లో ప్రజల అవసరాల కోసం దానం చేసిన భూమిని కొందరు ఆక్రమించే ప్రయత్నం చేశారని స్థానికులు ఆరోపించారు. లెంకల మల్లయ్య, ఆయన కుమారుడు సదానందం తమకున్న నాలుగు గుంటల భూమిలో రెండు గుంటలును ఆంజనేయ స్వామి దేవాలయానికి, మిగిలిన రెండు గుంటలును ప్రజల అవసరాలకు దానం చేశారు. ఈ భూమిని స్థానికంగా ఉండే గాజన వేణి రాజయ్య అనే వ్యక్తి మరో కొందరితో కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నించగా, స్థానికులు ప్రతిఘటించారు. గత 30 ఏళ్లుగా ఈ స్థలంలో బతుకమ్మ, దసరా వంటి పండుగలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకోసం భూమి ఇవ్వడాన్ని గౌరవించకుండా, దాన్ని స్వార్థంగా ఆక్రమించేందుకు చేయబోతున్న ప్రయత్నం దుర్మార్గం. జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఎ, రెవెన్యూ శాఖ మంత్రులను కలిసి ఈ భూమిని కాపాడుకునే వరకు పోరాటం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు. కబ్జా యత్నాలు సిగ్గుచేటని, స్వచ్ఛందంగా ఆ భూమిని ప్రజల అవసరాలకే వదిలేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి నాయకుల నిరసన

**ప్రజాపక్షం / తాండూర్ :** పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ యు. జోత్స్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి మాట్లాడుతూ పెగడపల్లి గ్రామంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి బలహీన వర్గాలు పోడు భూముల్లో పండ్లు పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎన్నేళ్లుగా సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలిస్తామంటూ ప్రకటనలు చేస్తూ మోసం చేసింది. ఇప్పటికైనా హామీ నిలబెట్టుకోవాలి అని డిమాండ్ చేశారు. భూములకు పట్టాలు వచ్చేంతవరకు పోడు రైతుల పక్షాన బిజెపి పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వడం ద్వారా తమ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా సీనియర్ నాయకులు రామగౌని మహీధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, దుర్గ చరణ్, ప్రదీప్,శంకర్, రైతులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పిట్లం శాఖ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ బాబురావు పుట్టినరోజు సందర్భంగా పిట్లం మండలకేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిట్లం అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలు, లయన్స్ సభ్యులు నారాయణరెడ్డి, వేణుగోపాల్, లక్ష్మీ నారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో అన్నదానం

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ మాజీ గవర్నర్ బాబురావు పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ వారు సుమారు 200 మంది అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గంగుల చిన్నయ్య, కార్యదర్శి నర్సయ్య, సభ్యులు పిస్క గంగాధర్, సురేష్, గోపినాథ్, నరేష్, జనార్ధన్, జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నందిపేటలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో సుఖీభవ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం జరిగింది. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద మహిపాల్ పుట్టినరోజు సందర్భంగా పలువురు యువకులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. పెంట ఇంద్రుడు, రాజేందర్, దమ్మాయి శ్రీను, ఏసుబ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘానికి నిధులు ఇప్పించండి

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలోని అయిలాపూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పద్మశాలి కల్యాణమండపానికి నిధులు మంజూరు చేయించాలని మాజీ బాల్కొండ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కుమార్‌ను అయిలాపూర్ గ్రామ పద్మశాలి పెద్దలు వేడుకున్నారు. ఆయనను కిసాన్‌నగర్‌లో కలుసుకొని తమ సమస్యలు విన్నవించుకున్నారు. గత ప్రభుత్వం కల్యాణమండపానికి పది లక్షలు మంజూరు చేసిందని పనులు పూర్తయినా నిధులు రాలేవని సంఘ పెద్దలు ఆయన దృష్టికితెచ్చారు. ఈ డబ్బులు ఇప్పించాలని, మండపం పూర్తిచేయడానికి మరిన్ని నిదులు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా అయిలాపూర్ పద్మశాలీలు మాజీ ఎమ్మెల్యే అనిల్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కుల పెద్దలు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలి

### పిడిఎస్‌యు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని టియులో ఇంజనీరింగ్ కోర్సులు రెండో విడతలో ఎందుకు పెట్టలేదో బహిర్గతం చేయాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో ర్యాలీ, ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే మూడో విడత కౌన్సిలింగ్‌లో తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు వెంటనే పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో జిల్లాలో పార్టీలకతీతంగా అన్ని పక్షాలను కలుపుకుని ఇంజనీరింగ్ కలాశాల సాధన సమితి ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు దేవిక, మనోజ్ పాల్గొన్నారు.

## ధృవపత్రాల పరిశీలన

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విశ్వవిద్యాలయ పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి పిహెచ్‌సి విద్యార్థులకు 31న ధృపవత్రాల పరిశీలన టియులో అడ్మిషన్ల కార్యాలయంలో జరుగుతాయని ఈ ప్రత్యేక కేటగిరి విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లు రెండు సెట్లు జిరాక్స్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 ల నుండి 5 గంటల వరకు హాజరు కావలని కోఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు.

## ఎక్సైజ్ శాఖలో పట్టుబడ్డ వాహనాల వేలం

**ప్రజాపక్షం/మాక్లూర్ :** పట్టుబడిన వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంలంలోని మాదాపూర్ గ్రామంలో ఐఎంఎల డిపోలో నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటకు సంబంధించిన వివరాలకు నిజామాబాద్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.



## విజయదుర్గ పార్థివదేహం మెడికల్ కాలేజీకి అప్పగింత

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మంగళవారం అనారోగ్యంతో మరణించిన సిపిఎం నాయకురాలు విజయదుర్గ పార్థివ దేహాన్ని నిజామాబాద్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. వీరిలో సిపిఎం నాయకులు పి.సుధాకర్, వై.ఓమయ్య, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, భాస్కర్ తీగల, సాగర్ రాష్ట్ర కమిటి సభ్యులు ప్రసాద్, ఎంవి.రమణ, ఆర్.వెంకట్, రాములు, రమేష్, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు నూర్జహాన్ వెంకటేష్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ రమ



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో దోహద పడతాయని ఎడపల్లి ఎస్ఐ రమ అన్నారు. ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో నిజామాబాద్ పోలీస్ శాఖ, ఎడపల్లి పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ క్రైం గంజాయి మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. కుర్నాపల్లి గ్రామంలో సిసి కెమెరాలు పనిచేసే విధంగా చూడాలని చోరీలు జరిగిన సమయంలో వ్యక్తులను గుర్తించడంలో సిసి కెమెరాల పాత్ర ఎంతో ముఖ్యం అన్నారు. అంతేగాకుండా ప్రస్తుత పరిస్థితుల్లో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, దీనివల్ల జీవితాన్నే కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్‌లు సైతం అధికమయ్యాయని, ఎవరూ తమకు సంబంధించిన వివరాలను వెల్లడించరాదని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ వివరాలను వెల్లడించరాదని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించరాదని చెప్పారు. సైబర్ క్రైమ్, యాప్ రుణాల వల్ల జీవితాలను కోల్పోయే ప్రమాదముందని అన్నారు. ప్రతి ఒక్కరూ వీటి వల్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోచారంలో ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన పోచమ్మ, నాగుల పుట్టలను ధ్వంసం చేసిన ఘటన గ్రామస్తులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. పోచమ్మ, నాగదేవతల పుట్టలను ధ్వంసం చేసి నిధుల కోసం అన్వేషించారని అనుమానంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు, దేవతలకు జరిగిన అపచారం తొలగించేందుకు బుధవారం ధ్వంసమైన గుడి వద్దనే పోచమ్మ, నాగదేవతల ఆలయాల నిర్మాణానికి పోచారం గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దలు, పోలీస్ శాఖ సంయుక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఇంద్రకరణ్, సొసైటీ డైరెక్టర్ నీరడి రవి కుమార్, విడిసి చైర్మన్ అంజని కుమార్, క్యాషియర్ కట్ట లక్ష్మయ్య, మాజీ విడిసి చైర్మన్ గంగాధర్, నాయకులు జక్కు రాజ్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి పోచారం గ్రామంలోని గ్రామ పెద్దలు, యువకులు, అలాగే జాన్కంపేట్ గ్రామంలో పెద్దలు, పోచారం, జాన్కంపేట్ గ్రామాల మధ్య శివారు ప్రాంతాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎస్‌కె.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** మండలంలోని పల్లె (హరిపూర్) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు జోరిగెదర్మయ్య లావణ్య దంపతుల పెద్ద కుమార్తె శిరీష నితిన్ వివాహ వేడుకలు బుధవారం పెర్కిట్‌లోని జికెఆర్‌ఎస్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలకు హాజరైన వారిలో మాజీ జడ్పీటిసి సారంగి సాందన్న, మాజీ సర్పంచ్ కుస్తాపురం గంగారెడ్డి, పల్లె కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రామ్‌సన్, డాక్టర్ శంకర్ దాస్, గంజి రవి, లింబాద్రి స్వామి, గోవర్ధన స్వామి, కపిల్ గౌడ్, లింబాద్రిగౌడ్, చిట్యాలపోశెట్టి, గంజి చంద్రశేఖర్, శాంతి తదితరులు ఉన్నారు.



## అధికారులు, నాయకులతో సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/బోధన్ :** బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్, మోస్రా మండలాల అధికారులు, నాయకులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగస్ట్ 4వ తేదిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో మండల సముదాయాల భవనాలను ప్రారంభించేందుకు వస్తున్నారన్నారు. ఈ మేరకు అధికారులు, నాయకులతో ఆ ఏర్పాట్లపై ఆయన సమావేశం నిర్వహించారు. అధికారులను ఏర్పాట్ల వివరాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



## కబ్జా నుండి మున్సిపల్ ఖాళీ స్థలాన్ని కాపాడండి

### నుడా చైర్మన్‌ను కలిసిన కాలనీవాసులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కబ్జాదారుల నుండి హౌసింగ్ బోర్డులోని మున్సిపల్‌కు సంబంధించిన ఖాళీ స్థలాన్ని కాపాడాలని నుడా చైర్మన్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. వినాయక్ నగర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీకి సంబంధించి రోడ్డు నెం.1లో కొందరు కార్ల షెడ్డు నిర్మించి స్థలాన్ని కబ్జా చేస్తున్నారని కాలనీవాసులు ఫిర్యాదులు పేర్కొన్నారు. కార్ల షెడ్డు నిర్మించటంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని న్యూహౌసింగ్ రెసిడెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నుడా చైర్మన్ కేశ వేణును బుధవారం కలిసి విపతిపత్రం అందజేశారు. దాదాపు 2000 గజాల స్థలాన్ని కబ్జా చేశారని దీనిపై తగు చర్యలు తీసుకుని స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని కాలనీవాసులకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని కోరారు. నుడా చైర్మన్‌ను కలిసిన వారిలో అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య, బాల్‌సింగ్, హన్మంతురావు, లక్ష్మణ్, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

**ప్రజాపక్షం/లక్ష్మణచందా :** మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ వడ్యాల్ నందు కలెక్టర్ అభిలాషఅభినవ్ స్వయంగా రూపొందించిన బాలశక్తి శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం, విద్యార్థులలో జీవన నైపుణ్యాలను కల్పించడం బాలశక్తి ప్రధాన లక్ష్యమని, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్ర పర్యటన అనుభవాలు, పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం అవసరమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్హానా బేగం వారిని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్ అశోక్ వర్మ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఎఎన్ఎం కృష్ణవేణి, ఫార్మసిస్ట్ శశిధర్, సిఆర్పి సుధాకర్‌లు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ ఆశిష్ జిల్లా అధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. డా.ప్రియాంక వైద్యాధికారిణి కాలనుగుణ వ్యాధులు,నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, డ్రైడే కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని రాజేశ్వర్ సామాజిక ఆరోగ్య అధికారికి సూచించారు. మందుల వివరాలను సామ్యూల్ ఫార్మసిస్ట్ ను అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్‌సి సిబ్బంది అందరికి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. కేంద్రానికి వచ్చే రోగ్లుపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, నాణ్యమైన వైద్యం అందించాలని తెలిపారు.



## లింగాపూర్‌లో కోతుల బోనుకు గౌడ సంఘం విరాళం..

**ప్రజాపక్షం/కడెం :** కడెం మండలం లోని లింగాపూర్ గ్రామంలో కోతుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎందుర్కొంటున్న నేపథ్యంలో,కోతుల నివారణ కమిటీ వివిధ చర్యలు తీసుకుంటోంది.ఈ క్రమంలో గ్రామంలోని గౌడ్ సంఘం తమ సామాజిక బాధ్యతలో భాగంగా కోతుల బోను ఏర్పాటుకు రూ.13.200 విరాళంగా అందించారు.ఈ నిధిని వారు బుధవారం రోజున కోతుల నివారణ కమిటీకి అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గౌడ సంఘంను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ విద్య, వసతులు అందించేందుకు చర్యలు

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఉత్తమ విద్య, వసతులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం ఖానాపూర్ లోని ప్రభుత్వ గిరిజన బాల,బాలికల వసతి గృహాలను ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని నాణ్యమైన విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు.పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు,ఉదయంసాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు.సిలబస్‌ను నిశ్చిత సమయంలోగా పూర్తి చేయాలని చెప్పారు.

వంటగదిని పరిశీలించిన కలెక్టర్,విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన,నాణ్యమైన భోజనం అందించాలన్నారు.కూరగాయలు,వంట సామాగ్రిని పరిశుభ్రంగా నిల్వ ఉంచాలన్నారు.పాఠశాలల పరిసర ప్రాంతాల్లో వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు.విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా,తక్షణమే మెరుగైన చికిత్స అందించాలన్నారు.రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు,సిబ్బంది విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,వసతి గృహాల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని తెలిపారు.అధికారులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,వసతి గృహాల్లో సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.అనంతరం కలెక్టర్ భవిత కేంద్రంను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్,మండల ప్రత్యేక అధికారి జీవరత్నం,తహసీల్దార్ సుజాత,ఎంపిడిఓ సునీత,అధికారులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ

### ఎమ్మెల్యే మహశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** దిలావర్‌పూర్ మండల కేంద్రంలో మండలానికి చెందని 12 గ్రామ పంచాయతీలకు చెందిన 588 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డు లేని అర్హులందరూ రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యకర్రమంలో ఆర్డీవో రత్నా కళ్యాణి, నాయకులు రావుల రాంనాథ్, తాజా, మాజీ జడ్పీటీసీ తక్కల రమణ రెడ్డి,నాయకులు ముత్యం రెడ్డి,చంద్రకాంత్,వీరేష్,మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, శైలేష్, విక్రమ్, మధుకర్, మల్లేష్, అచ్చుత్‌రావ్, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే..**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించే పిహెచ్‌సి హెల్త్ సెంటర్ నిర్మాణ పనులకు బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాజా మాజీ జడ్పీటిసి తక్కల రమణ రెడ్డి,నాయకులు ముత్యం రెడ్డి, చంద్రకాంత్ వీరేష్, మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, శైలేష్‌తోపాటు మండల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే..**

దిలావర్‌పూర్ మండలం దిలావర్‌పూర్ తండా నుండి బస్సపల్లి గ్రామం వరకు రూ.2.56 కోట్లు (రెండు కోట్ల యాభై ఆరు లక్షలు) నిధులతో ఆర్ అండ్ బి బిటి రోడ్డు నిర్మాణ పనులకు బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటిసి తక్కల రమణరెడ్డి,నాయకుల ముత్యం రెడ్డి,మాజీ ఎంపిటిసి సత్యం చంద్రకాంత్,మాజీ సర్పంచ్ వీరేష్,మండల అధ్యక్షుడు నర్సారెడ్డితో పాటు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నవ సంఘర్షణ సమితి నిర్మల్ జిల్లా నూతన కమిటీ నియామకం

### బిసి రిజర్వేషన్లపై ఉద్యమానికి పిలుపు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.బుధవారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా అప్క గజేందర్ యాదవ్ మాట్లాడుతూ,బీసీలకు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర అన్యాయం జరగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీల జనాభా 50 శాతం ఉన్నప్పటికీ,వారికి కేవలం 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఉన్నాయి.

ఎస్సీ,ఎస్టీలకు వారి జనాభా విష్పత్తిలో రిజర్వేషన్లు ఉండగా,అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ రూపంలో వారి జనాభాకు మించిన రిజర్వేషన్లు లభిస్తున్నాయి.అని ఆయన తెలిపారు.ఈ అసమానతల వల్ల విద్య,ఉద్యోగ రంగాల్లో బీసీ విద్యార్థులకు భవిష్యత్తులో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.విద్యా,ఉద్యోగ,రాజకీయ,స్థానిక సంస్థల రిజర్వేషన్లలో బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలలోని అన్ని పదవుల్లో బీసీలకు కనీసం 50 శాతం రిజర్వేషన్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.సామాజిక న్యాయం,రాజ్యాధికారం కోసం బీసీ,ఎస్సీ,ఎస్టీ,ముస్లింలు,క్రిస్టియన్లు అందరూ ఏకతాటిపైకి రావాలని గజేందర్ యాదవ్ పిలుపునిచ్చారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్,ఎంపీటీసీ,జెడ్పిటిసి,మున్సిపాలిటీ కౌన్సిలర్ వంటి పదవులకు పోటీ చేయాలని సూచించారు.బీసీ చట్టసభల్లో రిజర్వేషన్ లేకపోవడం వల్ల ఉద్యోగ,విద్య,రాజకీయ,ఆర్థిక రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి బీసీ గడపగడపకు వివరించాలని,సరలమైన తెలంగాణ భాషలో ప్రజలక అర్థమయ్యేలా తెలియజేయాలని కోరారు.

**నిర్మల్ జిల్లా నవ సంఘర్షణ సమితి నూతన కార్యవర్గం**

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ ఫిరోజ్,వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.నూతన కార్యవర్గంలో జనరల్ సెక్రెటరీగా దళ మల్క నర్సయ్య,అధికార ప్రతినిధిగా జుట్టు వెంకటరమణ,సెక్రెటరీగా పోశెట్టి,ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్ నియమితులయ్యారు.



## దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** దేవాలయాలను అభివృద్ధి పరచడం,మొక్కలను సంరక్షించడం మనందరి బాధ్యత ఎమ్మెల్యే బొజ్జు పటేల్,ఖానాపూర్ పట్టణ శివారు గాంధీనగర్ ప్రాంతంలో గల నల్ల పోచమ్మ ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి పూజారి ఈశ్వర చారి అందించిన తీర్థప్రసాదలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం దేవాలయాలను అభివృద్ధి చేయడంలో ముందు ఉందని తెలంగాణలో దక్షిణ కాశీగా పిలవబడే వేములవాడ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న విషయం మనకు తెలిసిందే అని అలాగే రాష్టంలో గల ప్రతి చిన్న దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తుందని ప్రతి ఒక్కరు అధ్యాత్మిక చింతన కలిగి మంచి మార్గంలో నడవడానికి దేవాలయాలు ఎంతో తోడ్పడతాయని అన్నారు.అదేవిధంగా మొక్కలు మనకు సహజవాయువును అందిస్తాయని,వాటిని సంరక్షించే బాధ్యత మన అందరిపై ఉండాలి ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని అన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మజీద్, కావాలి సంతు, కల్వకుంట్ల నారాయణ, బిసి రాజన్న, సిరిగారపు నాగరాజు,రాజురా సత్యం, జన్నారపు శంకర్, కృష్ణ అంకం రాజేందర్ పాల్గొన్నారు.



## సూరలోక గార్డెన్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టనంలోని సూరలోక గార్డెన్ లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణి చేసిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడారు.రేషన్ బియ్యం కోసం కిలోకు 40 రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు.గత పాలకులు 10 సంవత్సరాల పాటు రేషన్ కార్డులు ఇవ్వక పోవడం తో పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించడం మంచి పరిణామం అన్నారు.నా హయాంలో నియోజకవర్గంలో 17వేల కుటుంబాలకు రేషన్ కార్డులు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్డుల పంపిణి ప్రక్రియ నిరంతరాయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపిడివో సుధాకర్ రెడ్డి,మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతును రాజులా చూస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం

### సదర్మాట్ కెనాల్‌కు నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** బీడు భూములను కూడా మన రైతులు పచ్చటి పొలాలుగా మార్చి పంటలు పండించి రాష్ట్రంలో మన నియోజకవర్గన్ని ఆదర్శంగా నిలపాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు.బుధవారం ఖానాపూర్ మండలం సదర్మాట్ కెనాల్ నుండి ఆయకట్టు రైతులకు అవసరమైన సాగునీటిని విడుదల చేశారు.ఖానాపూర్,కడం మండలాల్లోని రైతుల సదర్మాట్ నీటిని సద్వినియోగం చేసుకోవాలని,రైతులకు సాగునీటితో పాటు విత్తనాలకు ఎరువులకు ఎలాంటి లోటు లేదని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని సూచించారు. పంటలు వేసే సమయంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడి సాధించేలా రైతుల కృషి చేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్,వైస్ చైర్మన్ మజీద్,ఏఈ నితిన్,దొనికైన దయానంద్,రాజురా సత్యం,అంకం రాజేందర్,జంగిలి శంకర్,గంగనరసయ్య,శేషాద్రి,ఆకుల వెంకగౌడ్,ఉఅధికారులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## మిత్రుడి కుటుంబానికి సహచరుల ఆదరణ

**ప్రజాపక్షం /పెంచికలపేట్ :** మండలంలోని చేద్వాయి గ్రామానికి చెందిన చింతపురి సత్తయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, మిత్రులు కలసి కుటుంబానికి ఆర్థికంగా సహాయం అందించారు. సామాజిక మాధ్యమాల ద్వారా సేకరించిన 30వేల నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. చెద్వాయి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సైతం బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. స్నేహితుడిని కోల్పోవడం బాధాకరం. కుటుంబానికి మేమంతా అండగా నిలుస్తాం అని మిత్రులు భావోద్వేగంతో తెలిపారు. సత్తయ్యకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్నేహితులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం / తాండూర్ :** ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉండటంతో తరచూ సరఫరా అంతరాయం కలుగుతుందని, చిన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో పెద్దదాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. బుధవారం వారు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి. ఈసా తో కలిసి తాండూర్ సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సబ్ ఇంజినీర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాలుగు లైన్లకు ఒక్కటే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల అదుపు లేకుండా లోడ్ పెరిగి తరచూ ట్రిప్ అవుతోంది. ఇది పెద్ద ఇబ్బందిగా మారింది అని వారు తెలిపారు. వినతి పత్రం అందజేసినవారిలో అనిల్ కుమార్, కె.వెంకటేశం, మణి కుమార్, నాగేష్, సాయి, అజయ్, వినయ్ కృష్ణ, మనోజ్ తదితరులు ఉన్నారు.

## గుంతల రోడ్లతో ప్రజల అవస్థలు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వర్షాలు మొదలైనప్పటి నుంచి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రహదారుల దుస్థితి మరింత అధ్వానంగా అయింది. ఓ వైపు మురుగునీరు రోడ్లపై నిలవడం, మరోవైపు మరమ్మతుల కొరతతో రహదారులు గుంతల పాలు కావడంతో ప్రజలు నిత్యం ప్రమాదాల మధ్య ప్రయాణిస్తున్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారులు వర్షాల వేళ బురదమయంగా మారుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఏర్పడ్డ కాలనీల్లో ఇప్పటికీ కచ్చా రహదారులే కనిపిస్తున్నాయి. నిర్మాణ అనుమతులు, స్థలాల క్రమబద్ధీకరణ, ఆస్తి పన్నుల రూపంలో భారీ ఆదాయం వచ్చినా రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు మురుగుకాల్వల్లోకి వెళ్లకపోవడంతో రోడ్లపైనే నిలిచిపోతోంది. ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది.

# నేటి నుంచి ప్రారంభం కానున్న ''ఆకాంక్ష హ్యాట్''

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణంలోని అంబేద్కర్ భవనంలో రేపటి నుంచి (జూలై 31,గురువారం) ''ఆకాంక్ష హ్యాట్ పేరుతో హస్తకళల ప్రదర్శన,కార్యక్రమాలు ప్రారంభమువుతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నీతి ఆయోగ్ ఆకాంక్ష హ్యాట్ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఆగస్టు 4వ తేదీ వరకు 5 రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయంగా తయారు చేసిన హస్తకళల ఉత్పత్తులను ప్రదర్శించి,విక్రయించనున్నారని తెలిపారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్,ఖానాపూర్ శాసనసభ్యులు,జిల్లా అధికారులు,ఇతర విశిష్ట అతిథులు హాజరవుతారని చెప్పారు. గతంలో పెంబి మండలంలో నిర్వహించిన నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ విభాగంలో ప్రదర్శించిన అత్యుత్తమ సేవలకు గాను జాతీయ స్థాయిలో కాంస్య పతకం లభించిందని అదనపు కలెక్టర్ తెలిపారు. దీనిని పురస్కరించుకుని రేపటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంస్య పతక విజేతలైన పెంబి మండల అధికారులు ఎ.ఎన్.ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, స్వయం సహాయక మహిళలు, ఇతర ఫ్రంట్‌లైన్ సిబ్బందిని జిల్లా స్థాయిలో సన్మానించనున్నట్టు వెల్లడించారు. ఈ ఘనత జిల్లాకు గర్వకారణమని, వారి సేవలకు గుర్తించి రాష్ట్ర స్థాయిలో జరగబోయే ప్రశంసా కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు, పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరుతూ, జిల్లా ప్రజలు హస్తకళల ప్రదర్శనను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ కోరారు.

# డుబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ఆందోళన వద్దు

### సమగ్ర సర్వే ద్వారా అనర్హులను తొలగించి అర్హులకు ఇస్తాం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుల సమగ్ర సర్వే చేసి అనర్హులను తొలగించి అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయిస్తామని,గత ప్రభుత్వ తప్పిదంతో,అనర్హులకు కేటాయించిన ఇండ్లను తొలగించి అర్హులను గుర్తించి వారికే ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తెలిపారు. అంతకుముందు వామపక్షాలు పార్టీలు ఖానాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శిసునారికారి రాజేష్,ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్నలు మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్‌లు గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు జరిగాయాని, గతంలో ఏదైతే లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారో,అందులో నిజమైన లబ్ధిదారులకు కేటాయించలేదని, పట్టణంలో గూడు గుడిసె లేనటువంటి నిరుపేదలకు కేటాయించాల్సింది పోయి కోటీశ్వరులకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని, ఖానాపూర్ పట్టణంలో పేదలకు కేటాయించకుండా ఇతర రాష్ట్రాల వారికి దొంగ అడ్రస్లు సృష్టించి డబుల్ బెడ్ రూమ్ ఇచ్చారని, గతంలో అక్రమాలు జరిగియని ఆందోళన చేసిన నిరుపేదల పైన అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం జరిగింది. వారిపై పెట్టిన కేసును వెంటనే తొలగించాలని, సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా వారి కుటుంబాల్లో పూర్తిస్థాయిలో సమగ్ర సర్వే చేసి అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వాలని, అనర్హులకు ఇల్లు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను తొందర్లోనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి బుక్యా సురేందరఐప్టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న,రాధా,కవిత స్వప్న, పద్మ, సునీత, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలోని ప్రతి వ్యక్తికీ ఆధార్ కార్డు ఉండేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ఆధార్ నమోదు ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆధార్ అనేది అవసరమని,ఆధార్ లేనివారిని గుర్తించి,వీలైనంత త్వరగా వారి నమోదు పూర్తిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన పత్రాల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని, విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రల్లో ఆధార్ లేని పిల్లల వివరాలు సేకరించి వారికి కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. శిశువులు పట్టిన వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలు తల్లిదండ్రులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించి,ఆధార్ కోసం నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. మారుమూల గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అధిక జనాభా కలిగిన పంచాయతీలను గుర్తించి ఆధార్ కేంద్రాలను పెంచాలని సూచించారు. బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాల విస్తరణపై దృష్టి సారించాలని తెలిపారు. నూతన ఆధార్ కార్డులు మాత్రమే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల వివరాలు సరిగ్గా ఉండేలా అప్డేట్ చేసుకోవడం కూడా అవసరం. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో మెగా ఆధార్ సహాయక శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఆధార్ ఉండకూడదని, అప్డేట్ లేదా జారీ కొరకు అధిక చార్జీలు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఈ దిశగా అధికారుల నియంత్రణ అవసరమని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, యుఐడిఎఐ ఆర్ఓ ఆఫీస్ హైదరాబాద్ అసిస్టెంట్ మేనేజర్ శోభన్,ఎల్డిం రామ్ గోపాల్, ఇడిఎం నదీం, పోస్టల్, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికం దోహదం

### ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ప్రజాపక్షం/కుంటాల :** మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికం ఎంతగానో దోహదపడుతుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని అంబకంటి గ్రామంలో శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. పండితుడు భగవాన్ జోషి ఆధ్వర్యంలో వేద పఠనము, మండపాంగ ఆరాధన, హోమము,అంగసంభార హోమము, గర్తన్యాసము, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట ఆరాధన,బలి,పూర్ణాహుతి ప్రోక్షణ,మహాదాశీర్వచనము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే ప్రత్యేక పూజలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందని,సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని ప్రజలంతా ఆయురారోగ్యతో అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సహస్ర మృతిపై ఆందోళన

### మిమ్స్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల మిమ్స్ జూనియర్ కళాశాల మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన కొత్తపెల్లి సహస్ర కుటుంబ సభ్యులు బుధవారం ఐబి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సహస్ర మృతికి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా విద్యార్థి సంఘాలు సైతం ఆందోళనకు దిగాయి. అనుమతులు లేకుండానే హాస్టల్స్ నడిపిస్తున్న కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి అని కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. కనీస భద్రతా ప్రమాణాలు లేకుండా హాస్టల్స్ నడుపుతున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ముట్టడి చేపడతాం అని హెచ్చరించారు.

## వైద్య సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రాజ్



**ప్రజాపక్షం / జైపూర్ :** సమయపాలన పాటిస్తూ ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించాలి అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రాజ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందారం ఆయుష్మాన్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ఓపి సేవలు, ఇంటింటికి ఆశా సేవలు, మందుల సరఫరా, రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి అని తెలిపారు. కాలం చెల్లిన మందులు తొలగించాలని, గర్భిణుల కోసం 102 అంబులెన్స్ సేవను వినియోగించాలని పేర్కొన్నారు. గ్రామంలో శుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారంలో రెండు రోజులు ఫ్రైడేలు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో డాక్టర్ శ్రావ్య, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సూపర్వైజర్ జ్యోతి, కృష్ణవేణి, గ్రామ సెక్రటరీ సుమన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.